క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొళ్ల: మండలంలోని బీజీ హళ్లి సచివాలయం పరిధిలోని టీడీ పల్లి, అగ్రహారం గ్రామాల్లో బుధవారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ సదాశివప్ప ఓ ప్రకటనలో తెలిపారు.

తురకలాపట్నం గ్రామంలో..

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో బుధవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గపడకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శివ స్వాములకు అన్నదానం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద శివ మాలధారులకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 120 మంది స్వాములు ప్రత్యేక పూజలు, భజనలకు హాజరయ్యారు. కార్యక్రమంలో నాగినాయని చెరువు సర్పంచ్ అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఊరేగింపు



టీడీ పల్లిలో జ్యోతులతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

రొళ్ల: టీడీ పల్లి కొత్త కాలనీ సమీపంలో జాజగిరి కొండలో వెలసిన ఆదిశక్తి మారెమ్మ దేవికి మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని మేళ తాళాలతో గ్రామం నడ్డిబొడ్డన ఉన్న ఆలయం వద్దకు తీసుకువచ్చి పట్టం కూర్చోబెట్టారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మోసుకుని ఊరేగింపుగా వచ్చి, అమ్మవారి ఉత్సవం విగ్రహం చుట్టు ప్రదక్షిణలు చేశారు. జ్యోతులను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదానం చేశారు.

15లోపు ఈ-కేవైసీ చేయించుకోండి

మడకశిర: నియోజకవర్గంలోని రైతులు పీఎం కిసాన్ పథకం కోసం ఈనెల 15వ తేదీలోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ కృష్ణమీనన్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. లేకపోతే పీఎం కిసాన్ పథకం వర్తించదని పేర్కొన్నారు.

అద్దెకు ఆర్టీసీ ఖాళీ స్థలాలు

హిందూపురం: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన లేపాక్షి రోడ్డులోని ఖాళీ స్థలాలను అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ మైనుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారాల కోసం డిపో మేనేజర్ ఆఫీసులో రూ.885 చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. 18వ తేదీన సాయంత్రం 5 గంటల వరకూ టెండర్ ఫారాలు విక్రయిస్తామన్నారు. పూరించిన టెండర్ ఫారాలను పుట్టపర్తిలో దాఖలు చేయాలన్నారు. 19వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు టెండరు దారుల సమక్షంలో టెండర్ల ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు. టెండర్లు, అద్దెలకు సంబంధించి అవగాహన సదస్సును బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక డిపో మేనేజర్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు హాజరుకావాలని కోరారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: దళిత హక్కుల పరిరక్షణ సమితికి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళితుల సమస్యలపై డీహెచ్‌పీఎస్ పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్లు నాగరాజగౌడ్, వేణు, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, కౌన్సిలర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

అమరాపురం: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేయడానికి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఏపీడీ జయసింహలు మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో కార్యదర్శులు వలంటీర్ల సహకారంతో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. నిత్యం 2,767 మంది కూలీలు పనికి హాజరయ్యేలా చూడాలన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, తదితర వాటిలో కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా తదితర వివరాలను మిషన్ అంత్యోదయ యాప్‌లో నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ హెన్రీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ త్రుటి

- విస్తృతంగా దాడులు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే 5 టన్నుల ప్లాస్టిక్ సీజ్
- రూ.1,89,650 జరిమానా విధింపు
- తగ్గుతున్న ప్లాస్టిక్ వాడకం

హిందూపురం టౌన్: ప్లాస్టిక్ కాలుష్య కోరల నుంచి నెమ్మదిగా పట్టణానికి విముక్తి లభిస్తోంది. ప్లాస్టిక్ వస్తువులపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే దుకాణాలపై ప్రభుత్వ యంత్రాంగం విస్తృతంగా దాడులు చేస్తోంది. ముఖ్యంగా వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పట్టణంలో దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేస్తూ భారీగా జరిమానా విధిస్తున్నారు. దీంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, స్ట్రాల వాడకం ఇప్పుడిప్పుడే అదుపులోకి వస్తోంది. పట్టణంలో దాదాపుగా 30 వరకూ ప్లాస్టిక్ వస్తువుల హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. సుమారు 100 నుంచి 150 కిరాణా, ఫ్యాన్సీ తదితర దుకాణాల్లో కూడా ఈ వస్తువుల విక్రయం జోరుగా సాగుతోంది. రోజూ దాదాపు రూ.లక్షల విలువైన మార్కెట్ లావాదేవీలు ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలతో సాగుతున్నాయి.

భారీ డంప్‌లు స్వాధీనం

హిందూపురం పట్టణం వ్యాపార, వాణిజ్యానికి పెట్టింది పేరు. ఇక్కడ పెద్ద సంఖ్యలో హోటళ్లు, బట్టల దుకాణాలు, తోపుడు బండ్లు, చాట్ సెంటర్లు తదితరాలు ఉన్నాయి. వీటి లావాదేవీలు అన్ని ప్లాస్టిక్ కవర్లు, వస్తువులతో ముడిపడి ఉన్నాయి. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్లాస్టిక్‌పై నిషేధం విధించింది. ఈ తరుణంలో ఇప్పటి వరకూ పట్టణ పరిధిలోని వివిధ చోట్ల దాడులు జరిపి భారీ డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సంవత్సర కాలంలో మొత్తం 5 టన్నుల దాకా ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేశారు. అలాగే రూ.1,89,650 మేర జరిమానాలు విధించారు. తనిఖీల్లో సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను మున్సిపాలిటీ పరిధిలోని కంపోస్ట్ యార్డుకు తరలించారు. అక్కడి నుంచి ఎర్రగుంట్లలోని జువారీ సిమెంట్ పరిశ్రమకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకూ 4 టన్నుల మేర తరలించారు.

అదుపులోకి ప్లాస్టిక్ భూతం

పట్టణంలో ప్లాస్టిక్ భూతం అదుపులోకి వస్తోంది. నెమ్మదిగా ప్లాస్టిక్ వాడకం తగ్గుతోంది. సింగల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ కవర్లు, కప్పులు పట్టణంలో కనుమరుగవుతున్నాయి. ఎక్కడ చూసినా మురుగునీటి కాలువలు ప్లాస్టిక్ వస్తువులు, కవర్లతో నిండి ఉండి మురుగు పారక ఇబ్బందికరంగా మారుతుండేది. ఏ చెత్త కుప్ప చూసినా అందులో ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తుండేవి. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా ప్రస్తుతం పట్టణంలో కాలువల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తూ కంపోస్ట్ యార్డుకు తరలిస్తుండంతో ప్లాస్టిక్ కాలుష్యం తగ్గుతోంది.



సీజ్ చేసిన కవర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ (ఫైల్) (ఇన్‌సెట్‌లో) సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్ల భారీ డంప్

ప్రజల సహకారంతో సాధ్యం



ప్లాస్టిక్ రహిత హిందూపురంగా మార్చడానికి ప్రజలు సహకరించాలి. ప్లాస్టిక్‌ను అరికట్టడానికి సంవత్సర కాలంగా సిబ్బందితో కలిసి నిత్యం దాడులు చేస్తున్నాం. సచివాలయ శానిటేషన్ సిబ్బంది రోజూ ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నారు. ప్రభుత్వం విధించిన ఆంక్షలను అమలు చేయడానికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే పలు గోడౌన్లు, దుకాణాల్లో నిల్వ వుంచిన దాదాపు 5 టన్నుల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. భారీగా జరిమానా విధించాం. ఆ కవర్లను రీసైక్లింగ్ కాకుండా చేసి వాటిని జువారీ సిమెంట్ పరిశ్రమకు తరలించాం.

– వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు



గోరంట్ల: పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



రొళ్ల: సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి,



హిందూపురం: పాండురంగ నగర్‌లో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ

రొళ్ల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బీజీ హళ్లి పంచాయతీ కేంద్రంలో మొదటి రోజు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఆనాడు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ పేరుతో టీడీపీ ప్రభుత్వం మోసం చేయడంతో పాటు మహిళ సంఘాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసినా నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణాలు మాఫీ చేశారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి అయా రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, సర్పంచ్ సదాశివప్ప, వైస్ ఎంపీపీ రత్నమ్మ, తహసీల్దార్ హసీనా సుల్తానా, పంచాయతీ కన్వీనర్ ముడుపేగౌడు, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, నాయకులు మారేగౌడు, దేవరాజు, నగేష్, నాగేంద్ర, హనుమంతరాయ, తిప్పేస్వామి, కిట్టప్ప, దేవదాసు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

గోరంట్ల: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. మంగళవారం గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని 4వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ పథకాల లబ్ధిని వివరించారు. పథకాల బుక్‌లెట్లను అందజేశారు. పేదల సంక్షేమం కోసం జగనన్న నవరత్నాల్లోని పథకాలు తీసుకొచ్చారన్నారు. వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి దేశంలో ఎక్కడా లేని విధంగా 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు రాజకీయ లబ్ధి కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలు పచ్చ చొక్క వారికే అందేవన్నారు. పింఛన్, రేషన్ కార్డు కావాలంటే జన్మభూమి కమిటీలకు కప్పం కట్టాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తరువాత కుల మత రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా నిరుపేదలను గుర్తించి, ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరుస్తున్నట్లు వెల్లడించారు. పేదల కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. అనంతరం తాగునీటి అవసరాలు తీర్చడానికి పంచాయతీ ఆధ్వర్యంలో 4వ వార్డులో ఏర్పాటు చేసిన రక్షిత మంచి నీటి ట్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు బాషా, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, ఉప సర్పంచ్ బాబు, సర్పంచ్ అశ్వర్థరెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, స్థానిక నాయకులు నాగేనాయక్, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, నరసింహరెడ్డి, సత్యనారాయణ, ఫారుక్ సుబహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అర్హులైన ప్రతి కుటుంబానికి అందుతున్నాయని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 27వ వార్డు కౌన్సిలర్ నాగేంద్రమ్మ, సచివాలయ, మున్సిపల్ అధికారులతో కలిసి పీలేకమ్మ గుడి ఏరియా, పాండురంగ నగర్ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇంటింటికీ తిరుగుతూ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. పీలేకమ్మ గుడి వద్ద పురాతన బావి పునరుద్ధరణ పనులతో పాటు, పాండురంగ నగర్‌లోని పార్క్‌లో లైటింగ్, పారిశుధ్య పనులు చేపట్టాలని అక్కడి ప్రజలు కోరారు. వివేకానంద యోగా కేంద్రం వద్ద డ్రైనేజీ నిర్మాణం వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయ్యప్ప గుడివద్ద మురుగు నీటి తొలగింపు పనులు వెంటనే మొదలు పెట్టాలన్నారు. విద్యుత్తు వైర్లను సరి చేయించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. హిందూపురం ప్రాంతంలో 30 ఏళ్లుగా ఒకే పార్టీని ఆదరిస్తున్నా.. ప్రజలకు వారు ఏం చేశారో ఆలోచించాలన్నారు. ఇనేళ్లుగా చేయలేని పనులన్నీ తాము మూడేళ్లుగా ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు సేవ చేస్తూ పని చేసే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, కౌన్సిలర్లు ఆయుబ్, మల్లికార్జున, ముస్తాక్, రోషన్, రమమత్‌బీ, రహమత్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి, పార్టీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, దిలీప్, ఇలియాజ్, సాదిక్, నరసింహులు, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి



సోమశేఖర్ రెడ్డి

సోమందేపల్లి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సోమశేఖర్ రెడ్డికి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించిందని తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. ఈయన సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారని, త్వరలో ఇక్కడి నుంచి రిలీవ్ కానున్నట్లు పేర్కొన్నారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

పెనుకొండ: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ, హెల్పర్ పోస్టులకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ శాంతలక్ష్మి మంగళవారం తెలిపారు. 27 మంది దరఖాస్తు దారులను ఇంటర్వ్యూలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. దరఖాస్తుదారులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

నేడు చేపల చెరువు వేలం

మడకశిర(అగళి): అగళి చెరువులో చేపల పెంపకానికి బుధవారం ఉదయం 11 గంటలకు శంకరేశ్వర స్వామి దేవాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. 3 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాలన్నారు. అగళి గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయిలు లేని వారు మాత్రమే ఈ వేలంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

చిక్కెర చెరువుకు..

గుడిబండ: మందలపల్లి పంచాయతీ పరిధిలోని చిక్కెర చెరువును ఉదయం 11 గంటలకు, అలాగే సి.సి.గిరి, బైరేపల్లి చెరువులను సి.సి.గిరి గ్రామ సచివాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఈఓఆర్‌డీ నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి అమరేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10,000 ధరావత్తు చెల్లించాలన్నారు.

పనులు వేగవంతం చేయాలి

హిందూపురం: స్థానిక ఆటో నగర్‌లోని ఆక్సిజన్ పార్కు అభివృద్ధి పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. మొక్కలతో పాటు పార్కు చుట్టూ కంచె, లైటింగ్ పనులు త్వరితగతిన పూర్తియ్యేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆక్సిజన్ పార్కు పట్టణంలోనే మోడల్‌గా నిలవాలని సూచించారు.

ద్విచక్ర వాహనం అపహరణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో సాయి అనే యువకుడికి చెందిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. మంగళవారం సాయంత్రం ఇంటి ముందు పల్సర్ 220 బైక్ పార్కింగ్ చేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

పెనుకొండ: అంగన్‌వాడీ వర్కర్‌ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు రమేష్ మంగళవారం డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరారు. అనంతరం సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, వజ్రం నాగప్ప, మురళి, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మాబున్నీసా, వరలక్ష్మి పాల్గొన్నారు.

లేపాక్షి: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కోరారు. మంగళవారం తహసీల్దార్ బాబుకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్‌వైజర్ పోస్టుల నియామకాల్లో వయోపరిమితి పెంచాలన్నారు.

ఆర్బీకేలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రమణారెడ్డి

చిలమత్తూరు: ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రమణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొడికొండ ఆర్బీకేలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. విద్య, వైద్యంతో పాటు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే రైతుల కోసం ఆర్బీకేలను తీసుకొచ్చి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ఎరువుల వాడకం, చీడపీడల నివారణ, సేంద్రియ వ్యవసాయం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఆర్బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ బాలసుబ్రహ్మణ్య స్వామి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ రాజారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి తూమకుంట గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలతో మమేకం కార్యక్రమం చేపట్టారు. ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలు అమలు అవుతున్న తీరు, వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే వస్తాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు, పార్టీ నాయకుల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చినా పని జరిగలేదన్నారు. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది మీ ఇంటి వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చిన ఘనత దేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామంలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజినమ్మ, కౌన్సిలర్లు అసీఫ్‌వుల్లా, శివ, రామచంద్ర, నాయకులు చంద్ర, సుధాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, రెహమాన్, మున్నా, లోకేష్, గంగప్ప, దాదు పాల్గొన్నారు.

జీతాలివ్వాలని పంచాయతీ కార్యాలయానికి తాళం



ఈఓ శివరాజయ్యను నిలదీస్తున్న గ్రామస్తులు

పావగడ: జీతాలివ్వలేదని నిరసిస్తూ తాలూకాలోని కన్మేడి గ్రామ పంచాయతీ ఉద్యోగులు మంగళవారం పంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. ఏడాది గడుస్తున్నా జీతాలు ఇవ్వక పోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామంటూ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఈఓ శివరాజయ్య గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని సంఘటనపై విచారణ ప్రారంభించారు. అంతలోనే గ్రామస్తులు అక్కడికి చేరుకుని నరేగా పనుల్లో చోటు చేసుకున్న అక్రమాలపై ఈఓను నిలదీశారు. పంచాయతీలోని కిలార్లహళ్లి ప్రభుత్వ పాఠశాలలో రూ.3 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. అయితే అదే నిర్మాణానికి రూ.7 లక్షలు నిధులు ఇస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గట్ల నిర్మాణం, పశువుల కొట్టం, ఫారం హోండాలు, రిచార్జ్ వెల్స్ తదితర నరేగా పనులను అడిగితే పని దినాలు లేవని, కొత్త ప్రణాళికలో పేర్లను చేరిస్తామని అధికారులు బుకాయిస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలపై సమగ్ర తనిఖీ నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. నరేగా తనిఖీ బృందంతో పనులను పరిశీలిస్తామని ఈఓ తెలపడంతో గ్రామస్తులు శాంతించారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి

హిందూపురం: సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీనివాసనగర్, బెంగళూరు రోడ్‌లోని గణపతి ఆలయంలో ఉదయం, సాయంత్రం మహాగణాధిపతికి పంచమృతాభిషేకాలు చేసి విశేషంగా పూజలు నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో గొర్రెల మృతి



పావగడ: తాలూకాలోని నాగేనహళ్లిలో రైతు నంజప్పకు చెందిన సుమారు 40 గొర్రెలు సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారి బసవరాజ్, పశు వైద్య శాఖ అధికారి సిద్ధగంగయ్య మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. అడవి జంతువుల దాడిలో గొర్రెలు మృతి చెంది ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. పోస్టు మార్టం అనంతరం నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. గొర్రెల మృతితో రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు నంజప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. నష్ట పరిహారం అందించాలని కోరుతున్నాడు.